


# కిరణ్మయి

డాక్టర్.వి.వి.బి.రామారావు

హయగ్రీవరావ్ మెట్లు ఎక్కుతూనే వున్నారు. ఇంకా ఎన్ని?... ఆయాసం వచ్చేస్తోంది ఇంకా మీదకి.... ఇంకా మీదకి.... మెట్లు ఇక మరి కనపడడం లేదు. మరొక మెట్ల వరస అల్లంత దూరాన కన పడుతోంది కాని ఈ వరసమీదనుంచి ఆ వరసమీదకు వెళ్ళడం ఎలా? ఎగిరి గంతేసి?

క్రింద పడితే మరేమయినా ఉందా? సరిగా అంత ఎత్తున వున్న ఆ మెట్ల మీదకి దూకడం సాధ్యమే?

క్రిందనున్న మెట్లు ఒకటీ ఒకటీ అదృశ్యమైపోతున్నాయి. మరి తనెలా నుంచున్నారు.

ఇక దూకెయ్యక తప్పదు. చెంగున గెంతాడు. కాని అవతల వరస మెట్లు దూరంగా జరిగిపోయాయి.

అతను క్రింద పడిపోతున్నాడు. మీదకి విసరిన రాయిలా దబ్బున కాదు. దూదిపింజలా గాలివాటానికి ఎగిరి కొట్టుకుపోతు న్నాడు.

చటుక్కున తెలివి వచ్చింది. ఒళ్ళంతా చెమట ... దాహం.

కిరణ్మయి ఏదీ?

గుండె దడదడా కొట్టుకుంటోంది. టేబిల్ సొరుగు తీసి చూశాడు. చీటీ ఏదీలేదు

ఎక్కడికి వెళ్ళి వుంటుంది? గోడ గడియారం ఐదుగంటలు చూపిస్తోంది. మసక మసకగా వుంది బయట.

పక్కగదిలో ముసలాళ్ళిద్దరూ మంచి నిద్రలో ఉన్నట్టు న్నారు.

బాత్‌రూమ్‌లో దీపం వెలుగుతోంది. కాని తలుపు తెరిచే వుంది.

అంత ఉదయాన్నే బయటికి వెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చి వుంటుంది?

"అమ్మా!" తలుపు దగ్గర నిలబడి పిలిచాడు.

"ఆ!... ఏంరా అబ్బాయ్! ఇంత పెందరాడే లేచావ్.... కోడలు ఏం చేస్తోంది?" యధాలాపంగా అడిగింది కాంతమ్మ.

"కిరణ్మయి ఎక్కడికి వెళ్ళి వుంటుంది?"

"వెళ్ళదమ్మా.... పూలు కోయడానికేమో!"

గబగబా మెట్లు దిగి నందివర్ధనం చెట్టూ, తులసిమొక్కా చుట్టూ తిరిగి చూసి ఆయాసపడుతూ మెల్లెక్కి వచ్చింది కాంతమ్మ.

"అత్తయ్యగారు దేవతలాంటి మనిషి..." తను చెప్పగా మరెవరికీ తెలియకుండా కోడలు దాని తల్లికి రాసిన ఉత్తరంలోని మాటలు నెమరువేసుకుంది కాని కాంతమ్మకి చిరు చెమటలు పట్ట సాగాయి.

రగిలే పర్వతాలని గుండెల్లో ఇముడ్చుకోవడం స్వభావంగా మారిపోయిన ఈ రోజెందుకో గుండె పీచు పీచుమంటోంది.

రావ్‌జీ ముఖం ఎర్రగా వాచిపోయింది. తేనెతుట్ట దగ్గర తేనె టీగలు ఝుమ్మని లేగి ముఖం వాచేటట్టు కుట్టడంవల్ల మాత్రమే అలా అవుతుందని కాంతమ్మకి తెలుసు. మరి తేనెటీగలేవీ? ఇరుగు పొరుగు వాళ్ళూ, చుట్టుపక్కలవాళ్ళూ తేనెటీగలు కారూ? సూటిపోటి మాటలతో తననీ కొడుకునీ కుట్టడంలేదూ?

రావ్‌జీ మనసులోనే బాధ పడుతున్నాడా? ఏమయితేనేం తన ప్రతిభవల్ల కోడలికి పగ్గాలు వేయించగలిగింది. తమని ఇంట్లోంచి వాడు వెళ్ళగొట్టలేదు. ముందొచ్చిన కొమ్ములని వెనకొచ్చిన చెవులు ఏం చెయ్యగలవ్?

ఎక్కడికి వెళ్ళగలదు ఈ కోడలుపిల్ల? వెళ్ళిందో చచ్చిందో! ఇంకా గొడవలు పెట్టడానికి బోల్డు అవకాశం వస్తుంది.

కాని తన బిడ్డ పార్వతి ఎలా ఉందో? ఇద్దరు మగబిడ్డల తరువాత పుట్టిన లేక లేక కలిగిన ఆడపిల్ల.

ఎలా ఉందో, ఏం బాధపడుతుందో!

తనయి వెళ్ళి చూసి రాలేదు. బస్‌స్టాప్‌లో ముక్కూ మొగమూ తెలియని ఊళ్ళో తననీ, చిన్నాడినీ కుళ్ళబొడిచారే... నడుం నటుక్కుమని పోయింది.. ఎలా వెళ్ళడం?

కట్నమయితే ఇవ్వలేదు కాని ఇల్లు గుల్ల చేసి కూతురి కాపురానికి ఎంత పెట్టిందనీ....

వెళ్ళాలనే వుంది....కాని ఈసారి ప్రాణాలతో వదులుతారా?

అయినా చిన్నాడి సంగతి అంతే...పీకల మీదికి తెస్తాడు. ఆవేశంతో వళ్ళూ, పై కనడు. చెల్లెలి కాపురం కోసం ప్రాణమైనా ఇస్తానని చేసినదేమిటి?

చిటికెలో కాగితం రాసిపడేసి బావయ్య ఉద్యోగానికి ఎసరు పెట్టేశాడే! అవతలవాళ్ళు కోడలిపిల్లలా చేతకానివాళ్ళా పడి వుండడానికి?

తన కూతుర్ని తను చూడకుండా వుండలేదు. చూడలేదు. ఉత్తరం ముక్కయినా రాయనివ్వడం లేదు అవతలవాళ్ళు.

కూతురికి పెళ్ళి చేస్తే అలా అయింది. కోడలొచ్చిన ముహూర్తాన్నయినా సంసారం కుదుటపడుతుందేమో ననుకుంటూ ఉంటే...

ఇప్పటికే తనేమో ఇంటికి పెద్ద, పొరుగ్గి శివాలక్ష్మి అయిపోయింది. ఎవరి నోటవిన్నా 'కాంతమ్మలాంటి మనిషి వుందా!' అంటారు. కాని తనవాళ్ళందరికీ తను రాక్షసి....తనతో ఎంతో చనువుగా తిరిగి పనులు చేయించుకున్న వాళ్ళందరూ పైవాళ్ళే!...వాళ్ళు తన వెనక తన గయ్యాళితనాన్ని, మూర్ఖత్వాన్నీ చర్చించుకుని నవ్వుకుంటున్న విషయాలు కొద్ది కొద్దిగా బయటపడుతున్నాయి.

ఊళ్ళోవాళ్ళ మెహర్బానీ కోసం భర్తని కాదని స్నేహితులన్న వాళ్ళందరికీ నానా చాకిరీ చేస్తోంది....మంచికోసమే కదా!

కొడుకులకి నిజంగా తనంటే అసహ్యమా? నిజంగా తను అంత చెడ్డమనిషా?

కోడలు ఎందుకు తనంటే భయపడిపోయింది? నిజంగా ఇల్లు వదలి వెళ్ళిపోయిందా? నిముషంలో మరొక పెళ్ళి చేసి కోడలుపిల్లను మరొకర్తెని తీసుకొస్తానని అనేసిందే! నిజంగా ఆ పని చెయ్యడం సాధ్యమా? పనిమనిషి వచ్చి కోడలేదంటే ఏం చెప్పాలి?

తన మాట చిన్నవాడు వినడు. పెద్దవాడు ఇంటిలోనుండి వేరు వెళ్ళనివ్వడు. ఇంట్లో సుఖంగా ఉండనూ ఉండనివ్వడు. ఈ కాలంలో పిల్లలే అంతేమో!

కిరణ్మయి చదువుకుందని అహంకారం....అంతేకాదు తాము తమ అల్లుడికి చేసిన అవమానం గురించి తెలీ కాక కోడలిని సులువుగా కెచ్చేశాననే ఆనందం కాస్త తన దగ్గరనుంచి ఎగిరిపోయింది.

మూడు నెలల్లోనే ఆ అమ్మాయి మనస్సు విరిగిపోయిందా? నిజమే - విరిగిపోవడంలో ఆశ్చర్యం లేదు.

మరేం చేతకాకపోయినా ఊచకోత పెట్టడం ఆ ముసలాడికి తెలుసు. తనా ఏమిటి - చదువూ సంధ్యా లేక పడివుండడానికి!

పుట్టి పెరిగి ఇరవయ్యేళ్ళు వచ్చాక వేళ్ళు సహితం పెకలించుకొని అత్తవారింట్లోకి వచ్చిన ఏ ఆడపిల్లకయినా తబ్బిబ్బు సహజమే.

కాని - 'నీ తండ్రి వెధవ....నీ తల్లికి మర్యాద తెలీదు. అల్లుణ్నెలా చూడాలో...వియ్యాలవారిని ఎలా గౌరవించాలో తెలియని చదువుకున్న మూర్ఖులు...డిగ్రీలయితే వున్నాయి కాని, సంస్కారం మీ నాన్నకి లేదు!" అని ఇంటిల్లిపాదీ మొహం మీద తిడుతూ వుంటే, ఒకరు తిడుతున్నప్పుడు ఇంకోరు తాళం వేస్తూ ప్రతి చిన్న విషయంలోనూ పుట్టింటివారిని దుయ్యబడుతూ వుంటే' తప్పు మనుషులంటూ వుంటే ఏ ఆడపిల్లయినా పడి వుండగలదు?

ఇంతకీ వియ్యాలవారు చేసిన తప్పేమిటి!

ఈ మాట పిల్లలతో చెప్పి లాభం లేదు...భర్తతో అందామా అంటే అవకాశమే ఇవ్వడు. అటుపక్క మనుషులు ఏం చేసినా, ఏం

మాటాడినా ఏం రాసినా పెడార్థాలూ, విపరీతార్థాలూ తీసి ఊరికే నోరు పారేసుకుంటాడు. ఆయన అన్నదానికల్లా చిన్నవాడు వంత పాడుతాడు. అగ్నికి ఆజ్యం తోడవుతుంది. చిచ్చు రగులుతుంది. చిన్నవాడికదే సంతోషం కాబోలు.

ఇంతకీ ఇంటిలో ఎవరూ తెలుసుకోలేకపోయేదేమిటంటే పెద్ద కోడలుగా ఆ పిల్ల చేతిమీదుగా అన్నీ జరగాలి. ఇవాళ ఎందుకయితేనేం పడివుంటుంది. మరి నాలుగేళ్ళ తరువాత.

ఏ ఆడపిల్లయితే మాత్రం తల్లినీ తండ్రినీ నిర్హేతుకంగా తూలనాడుతుంటే ఎన్నాళ్ళని భరించగలదు? అసలు ఇన్నాళ్ళూ ఆ అమ్మాయి తట్టుకోగలగటమే వింత.

ఇల్లాంటిదేదో కొంప మునుగుతుందని తనకు ఎప్పుడో తెలుసు.

చిన్నవాడు తొణకకుండా నిండుకుండలా వున్న ఈ పిల్ల తల్లితండ్రుల నేం చెయ్యగలడు?

ఇంతకీ ఇదంతా ఏదో శాపంలా ఉంది - స్వామీజీకి చెయ్యాల్సిన సేవలు చేసిందే...అందుకేనా ఆయనకు తనమీద, తన సంసారం మీదా ఇంత కినుక?

తన భర్త ఆయన వెనక అన్నమాటలు, తపస్సంపన్నులు, ఆయన చెవికి సోకాయా? ఆయన ఎలాగూ మంచానపడి అనుభవిస్తూనే ఉన్నారు.

ఇప్పటికే సంసారం గుట్టు రట్టయింది. ఇక తల ఎత్తుకుని ఎలా తిరగడం?

వియ్యపురాలిని తనే అంది అనరాని మాటలు.... పెట్టుపోతలు ఆశించడం ఎంత నీచమైన పని! ఇంటి గుమ్మం ఎక్కవద్దని అల్లుడు తెగవేసి చెప్తే వాళ్ళు ఏం చెయ్యగలరు?

తన బిడ్డని కొత్త కోడల్లో చూసుకుందామనుకుంటే కొంప తీసి ఏ నూతిలోనో దూకలేదు కదా ...

పార్వతి ...తన బిడ్డ తనువుకొచ్చింది. ఏ క్షణాన్న దాని గురించి దుర్వార్త వినవలసి వస్తుందో అని అనుకుంటూ వుండే ఇలా జరిగింది.

గుండె చెరువయిపోయింది.

"ఆవిడంతేలేరా! తండ్రిననీ, తల్లిననీ. తమ్ముడిననీ, అన్నననీ.... చెల్లెళ్ళననీ తొణకదు. ఎంత కవ్వించినా జవాబు చెప్పలేదు. ఎంత ధైర్యం? నువ్ కాబట్టి అలా పడివున్నావ్.... నేనే అయితేనా చీల్చి చెండాడేవాణ్ని..." చిన్నాడు రొప్పుతున్నాడు.

కాంతమ్మ ఒళ్ళు జలదరించి భయంతో గజగజలాడిపోయింది.

"ఎవడితోనో లేచిపోయిందేమో!" చిన్నాడు బిగ్గరగా అరిచాడు.


"ఎవడితో లేచిపోతుందిరా నీచుడా....నువ్ మొదటినుంచీ కళ్ళలో నిప్పులు పోసుకుంటూనే ఉన్నావు..." రావ్‌జీ మండిపడిపోయాడు.


"వాడి మాటలు పట్టించుకోకురా పెద్దా....అన్నంటే వాడికి దైవసమానం... "

"అన్నా! అన్న ఎవడు వీడికి....అందరూ నాతో సహా, దాన్ని చిత్రహింసలపాలు చేశాం...నా పెళ్ళాం ఎవడితోనో లేచిపోయిందంటాడా...." పెద్దాడు ఉపుక్కున ఉమ్మేశాడు.

"వాడిననకురా! వాడిది వెర్రి ఆవేశం...."—ముసలాయన ఉండబట్టలేకపోయాడు.

"చెల్లి ఊసుకాని, ఈ వెధవ మంచివాడని కాని మళ్ళీ ఎప్పుడయినా నా దగ్గర అన్నారో నే ఉరేసుకు చస్తా ...పోతేపొండి.... అభం శుభం తెలియని ఆడపిల్లని మీరు ఆడించమన్నట్టు ఆడించి ఈ స్థితికి తీసుకొచ్చాను....మా మామ నా ఆత్మాభిమానం మీద దెబ్బ తీశాడన్నారే ..మీకు ఆత్మాభిమానం వుంటే మరిక్కడ ఉండకండి! బయట చావండి. మీరూ నేనూ తిట్టినంత మాత్రాన - అవమానించి.



నంత మాత్రాన ఆతగాడి పలుకుబడి తగ్గదు. ఆయన డిగ్రీలూ చెరిగి పోవు....ఇవాళ కాకపోతే రేపు ఆయనకు జరిగినదంతా తెలియకుండా పోదు. నాకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు ...మీరు ఇల్లు వదలి పోవాలి...లేక నేనూ దానితోపాటు ఇల్లు వదలిపోవాలి...మానసికంగా నేనెప్పుడో చచ్చిపోయాను...."

రావ్‌జీ ఝుంఝూమారుతంలా లేచాడు.

సంతోషం చూడలేనట్టి పాపం ముసలాడు దుఃఖాన్నీ, ఆవేశాన్నీ - కామాన్నీ సంబాళించుకోలేదు - లేవబోయాడు. భార్య తన క్షేమం కోసం అర్చన చేయిస్తానంటే కోవెలకు వెళ్లేది వేరే మర్మంతో అని పెడార్థాలు తీస్తాడు "నాకు గురువులూ, బాబాలూ, స్వాములూ- వీళ్ళమీద నమ్మకం లేదు. ఈ ముండ నాకోసం కాదు వెళుతుంట. దాని సొద దానిది. నువ్ గుమ్మం దిగడానికి వీల్లేదు....నాకు నచ్చం రాయి...అని నిలదీస్తాడు.

ముసలాడు సగం లేచి వెనక్కి వాలిపోయాడు. కాని నోరు మాత్రం ధాటిగానే వుంది.

"అదికాదురా అబ్బాయ్! దానికి మొదటినుంచీ నీమీద ఇష్టం లేదు. దాని తల్లీ తండ్రీ దాన్ని నీకు ఎలాగో కట్టేసి వదిలించేసు కున్నారు. అదే అలా అందని నువ్వే చెప్పావుగా....చదువుకున్న పిల్ల కావాలని పప్పులో కాలేశావ్. ఆదర్శాలన్నావ్, నిలబెట్టు కున్నావా! కట్నం తీసుకోనన్నావ్, మానేశావా? ప్రేమించి పెళ్ళాడతా నన్నావ్! నిన్నెపతయినా ప్రేమించిందా, ఒంటిపిక వెధవా! నన్ను పొమ్మనడానికి నీకెన్ని గుండెలు?"

"మీరు ఊరుకుంటారా లేదా! మన బిడ్డని మనం ఏమనుకుంటే ఏం లాభం?" కాంతమ్మ వారించబోయింది.

"మరెవరిననేది? అది పోయిందిగా?"

"ఊరుకోండి! అదెక్కడికీ పోదు....మన కుటుంబానికి వెలుగు తీసుకొస్తుంది...."

"ఒసేయ్ కాంతం, నీ మనసులో వున్నది వేరు-నువ్ చెప్పేదీ వేరు - చేసేది మరొకటి! నువ్ నోరు మూసుకో. ఎవరిని ఎలా లొంగదీయాలో నాకు తెలుసు...."

"ఆ తెలుసు....మీరేం తక్కువ మనుషులేమిటి? మీ కుళ్ళు బోతుతనం నా బిడ్డలకి డిగ్రీలు రాకుండా ఆపగలిగిందా-" కాంతమ్మ ఉండబట్టలేక అనేసింది.

రావ్‌జీ కాస్త తమాయించుకున్నాడేమో మెల్లగా ప్రారంభించాడు. తనమీద తనకే జాలి-అసహ్యం రెండూ వేస్తున్నాయి.

"మీరు ఎప్పుడూ ఇలాగే - నువ్ జంతువ్వి అంటే నువ్ పశువ్వి అంటూ ఘర్షణ పడుతూ ఇక్కడే కాలక్షేపం చెయ్యడం ఇక కుదరదు...నా బ్రతుకు పాడై పోయింది. మొగుడూ పెళ్ళాలని విడదీశారు....తలుపులు వేసుకుంటే వేసుకున్నామని ఏడిచారు. తీసి ఉంటే దాన్ని చిత్రహింసలు పెట్టి కళ్ళబొడిచారు...పనిపాటలు రావన్నారు...చేతకానిదన్నారు. పొగరన్నారు. గర్వమన్నారు... మీకందరికీ జబ్బులున్నాయని దాన్ని జబ్బు మనిషన్నారు....ఆ చిన్న వెధవకి మనుషుల్ని బురదలోకి తొయ్యడమెలాగో తెలుసు. మంచిగా మాటలాడుతున్నట్టే మాటాడి మన సంగతి ఏమాత్రం తెలియని నా అత్తమామల మీద నానా రకాల మాటలూ పుట్టించాడు...వాళ్ళు ఆపేక్షతో, ఆదుర్దాతో, ఆవేశంతో రాసిన ఉత్తరాల్లో ప్రతి మాటకీ విపరీతార్థాలు తీసి, తర్జన భర్జనలు చేసి మా మనసులు విరిచేశాడు. తల్లి అంటే అసహ్యించుకునేటట్లు చెయ్యాలని ప్రయత్నం చేశారు. మనకయితే ఇలా కొట్టుకోడాలూ, రొప్పుకుంటూ రొజుకుంటూ బురదలో పందుల్లా ఒకరిమీద ఒకరు కేకలేసుకోడం అలవాటు ఎన్నాళ్ళని సహిస్తుంది? ఆలోచని కలది కాబట్టి ఇన్నాళ్ళు నిభాయించు కుంది. తల్లికి ఉత్తరం ముక్క రాయకూడదని ఆంక్ష పెట్టినా, తండ్రి ఇంటికి వస్తే ముఖం కనపడనియ్యకూడదని శాసించినా ఊరుకుంది.... ఇప్పుడేం చేస్తారో, ఏం చెయ్యమంటారో బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచించండి.

నాకయితే జైలుకి పోవడమే తెలుసు. ఇంతకంటె ప్రశాంతంగానే వుంటుందక్కడ! - మీరు కంటికి కనపడరు కాబట్టి. నా తప్పు నాకు తెలియడానికి అవకాశం లేకుండా - మనం చేస్తున్నవన్నీ ఘన కార్యాలనీ, మనంత గొప్పవాళ్ళు ఎవరూ లేరని....మనకంటె తెలివయినవారెవరనీ నన్నిలా తయారుచేశారు. ఇక ఏమయినా చింత లేదు...."

గదిలోకి వెళ్ళి తలుపు వేసుకొన్నారు రావ్‌జీ.

"ఒరేయ్ పెద్దాడా! నీ తల్లిని, నీకంటే ఎక్కువ బాధపడు తున్నదాన్ని. నే చెబుతున్నా విను. చిన్నదాని బ్రతుకు కొంతలో కొంత నిలబెట్టినవాడివి నువ్వు....ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించరా! మనలో మనం కొట్టుకుని వీధిలో పడితే ఏం ప్రయోజనం...ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా ఏం చేస్తే బాగుంటుందో చూడు!"

కాంతమ్మ బిబోడిబో మంది.

"ఎక్కడికి వెళుతుందే వెర్రిబాగులదానా....మనం ఇంట్లో ఉండడం ఇష్టంలేక మనల్ని పొమ్మనే ధైర్యమూ లేక, మొగుడూ, పెళ్ళాం ఇలా నాటకమాడుతున్నారు....వాళ్ళిద్దరూ ఎప్పుడూ ఒకటేనే" ముసలాయన అందుకున్నాడు.

"అవును వాళ్లే నాటకమాడుతున్నారు....మీరేం తక్కువ వాళ్ళా! నన్ను నిముషం నమ్మకుండా....మగబుద్ధికేం లోటు లేదు మీకు....మీకు అనుమానం సంకటం మండిపోను!"

"కాదే కాంతం! నిన్ను వదలి వుండలేక...ఎదురూబొదురూ కూచుని నీతో మాటామంతీ అడుకుంటుంటే బాగుంటుందని.... అయినా మనమిద్దరం వేరే పోవడమే మంచిది. వాళ్ళూ మనమూ కూడా చిలకా గోరింకల్లా...."

"నోరు మూసుకోండి...మీ ముచ్చట మండినట్టుంది.

హయగ్రీవరావ్‌కి ఈ సంభాషణ వినపడుతూనే వుంది. కోడ లెవైపోయిందోనన్న ఆలోచనే లేదేం వీళ్ళకి! కిరణ్మయి నివురుగప్పిన నిప్పన్నమాట! భగ్గుమంటే అందరినీ బుగ్గి చేస్తుంది.

ఇప్పుడెలా! ఏం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి?

"ఏంరా! మమ్మల్ని పొమ్మంటావా? ఇప్పుడే చెప్పు...."నా శవం మీదనుంచి వెళ్ళండి! అన్నావే....అది వెళ్ళిపోయింది.... మమ్మల్నీ పొమ్మంటే చెప్పు, ఇప్పుడే పోతాం! ఒకటి మాత్రం నిజం....అది వాళ్ళ వాళ్ళ ఇంటికి వెళ్ళడం జరగని పని...."

"మీరు ఊరుకోండి! అసలు అదలా కట్టుగుడ్డలతో వెళ్ళి పోయిందా? ఏమయినా పెట్టె సర్దుకుని తీసుకుని వెళ్ళిందా?" కాంతమ్మ అడిగింది.

లోపలనుంచి జవాబు లేదు.

తలుపు దబదబా బాదింది. తలుపుకేసి తల బాదుకుంది.

"డిగ్రీలూ, సర్టిఫికేట్లూ తీసుకెళ్ళింది .... అంతే సువ్ చేయించిన గొలుసూ, ఉంగరమూ ఇక్కడే వున్నాయి....ఇక నేను బ్రతికి ఉండడం దండగ!" రావ్‌జీ భోరుమన్నాడు.

"అదేమిట్రా నీకేమిటి లోటు! దానికి యోగ్యత లేకపోతే పోయింది....నీకు మరొకర్తె వస్తుంది" చిన్నవాడు ధైర్యం చెప్పబోయాడు.

"నువ్ నోర్మూయ్!"

"పోనీ వాళ్ళ నాన్నకి టెలిగ్రాం ఇస్తే?" కాంతమ్మ అంది.

"నీ మొహంలా వుంది. ఆయన వెంటనే పోలీసు రిపోర్టు ఇస్తాడు....మనమంతా వ్యాన్ ఎక్కాల్సి వస్తుంది!" రావ్‌జీ కంగారుగా లోపలనుంచి అరిచాడు.

కిరణ్మయి ఇలా ఎందుకు చేసింది? తనని తను శిక్షించు కుంటూ తమందరినీ క్షమించిందా? లేక తమనందరినీ శిక్షించడానికి ఇదొక్కటే మార్గమనుకుందా?

ఎలా అయినా కిరణ్మయి కాంతిపుంజమే! దానికి చీకటి అంటు కోదు. చీకటిని చీల్చడమే దాని లక్ష్యం! లక్షణం.

తల మోకాళ్లలో పెట్టుకుని మంచంమీద కూలబడ్డాడు హయగ్రీవరావ్!


# వైద్య రంగములో కాంతి కిరణం

డా॥ ఎస్. కృష్ణవేణి, శాంతిథియేటరు ఎదురుగా, గాంధీనగరం, విజయవాడ-3

ఈ ఆధునిక శతాబ్దములో మానవుడు చంద్రమండలానికి చేరుకోవడానికి, ఒక బాంబుతో ఒకదేశాన్ని నాశనం చేయగల శక్తిని సంపాయించాడు. కాని మానవతాదృష్ట్యా విశ్వమానవశ్రేయస్సు కోసము సామాన్య జనులు, కీళ్ళవ్యాధులు క్యాన్సరు, పోలియో మొ॥గు వ్యాధులకు చికిత్స కనుగొనలేకపోయారు.

కీళ్ళనొప్పులు, పోలియో, మెదడు పక్షవాతము, పార్కింగ్సన్ వ్యాధులు, ఉబ్బసం, షుగర్, సుఖ వ్యాధులకు చికిత్స ఎలక్ట్రో మాగ్నెటు వేవ్సుద్వారా మూలికల సంయోగముతో డా॥ మోహన కృష్ణమూర్తి డా॥ కృష్ణవేణి అను వైద్య దంపతులు శాంతిథియేటరుఎదురుగా గాంధీనగరు విజయవాడలో చికిత్సచేసి అనేక రోగాలకు స్వస్థత చేకూర్చారు డా॥ కృష్ణమూర్తి గారు. పది సంవత్సరములుగా ఆంధ్రదేశములో ప్రారంభించిన ఘనత వీరిదే. అందులో డా॥ కృష్ణమూర్తి గారు అనేక వ్యయప్రయాసలతో పరిశోధనలు చేస్తూ ఈ చికిత్సలో అద్భుత విజయము సాధించారు. డా॥ కృష్ణమూర్తి గారు ఆయన భార్య అయిన డా॥ కృష్ణవేణిగార్ల సహాయ సంపత్తులు - మరియు భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ ఒక్కొక్కసారి డా॥ కృష్ణమూర్తి గారు నిరాశ, నిస్పృహ చెంది నప్పుడు ఆయన సతీమణి ఎంతో ప్రోత్సాహము, ధైర్యమునిస్తూ ఆయనను పరిశోధనలలో ఉత్తేజితులుగా చేస్తూ ఈఘన విజయాన్ని సాధించారు.

ఈ వైద్య దంపతులు సెరబ్రలు పాల్సి, పోలియో, పక్షవాత వ్యాధిగ్రస్తులను కేవలము 2లేక 3నెలలలో కనీసము కూర్చో లేని రోగులు కూర్చొగలిగేటట్లు నయము చేసారు. పోలియో రోగులకు సన్నబడిన కాలు చేతులకు బాగున్న కాలు చేతులతో సమాన సాయికి, వంకరలను సరిచేసి అద్భుతముగా 3లేక 4నెలలలో పరిగెత్తే స్థితిలోనికి అనేకమందికి నయముచేసారు ఉబ్బస ఘగరు రోగులకు 1 నెల రోజులు ఉదయం బ్లాకు హెర్బల్ కాఫీని ఇస్తూ-ఎలక్ట్రో మాగ్నెటు కర్మ్ వేవ్స తోను, సాయంత్రము హెర్బల్ టీనిఇస్తు ఎలక్ట్రో మాగ్నెటు బెయిరు వేవ్సుతోను ఎంతోమందికి నయముచేసారు.

ఈ వైద్య దంపతులు ప్రత్యేక జర్మను సాంకేతిక ఎలక్ట్రో M. C. వేవ్సుతో కేదరు, చిరక్సతో కేన్సరు, ఉబ్బసము సమస్త కీళ్ళవ్యాధులు, పక్షవాతము, పోలియో, నరముల మానసిక హిస్టిరియా, మూర్ఛ వ్యాధులు మరియు ప్రత్యేక జపాను సాంకేతిక M. B. వేవ్సుతో అజీర్ణము, గాస్ ట్రబులు, ఉబ్బు రోగము (పేరుపట్టుట) కాలేయ వ్యాధులు, నిద్రలేమి. మూలశంక, భగంధరము ఏరిటీజము మధు అతిమూత్రము లు మొదలయిన వ్యాధులను ఈ వైద్యదంపతులు నయముచేయుచున్నారు.

ఈ ఆధునిక శతాబ్దంలో చికిత్సలేని
Cerebral Palsy - Arthritis Rheumatism,
Paralysis Agitans, Polio Venereal Diseases
Asthama, Diabetes వ్యాధులకు నూతనవైద్య ప్రక్రియతో
అంతిమ ఘడియలు సమీపించాయి.

భవాని, మద్రాసు